క్లుప్తంగా

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: వచ్చే నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగాంధ్రకు సంబంధించి యాప్ అందుబాటులో ఉందన్నారు. అవకాశం ఉన్న వారితో సచివాలయంలోనూ, విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారి వివరాలు స్కానర్ ద్వారా సేకరించాలన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు సిద్ధం



రైతులకు పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్న ఏవో

నక్కపల్లి: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 66 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ శుక్రవారం తెలిపారు. రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేలకు తగినంత సేంద్రియ పదార్థాన్ని అందించుటకు పచ్చిరొట్ట వాడకం సులువైన పద్ధతి అన్నారు. పుష్పజాతి పంటలు, పచ్చిరొట్ట పైర్లుగా జీలుగ, జనుము, పిల్లి పెసర వేసుకోవాలన్నారు. ఈ పైర్లు ఖరీఫ్ ముందు వేసుకుని పూత వచ్చే ముందు నేలలో కలియ దున్నుకోవాలని సూచించారు. దీని వల్ల భూమి బాగా గుల్లబారుతుందన్నారు. భూమిలోకి పోషకాల్ని అందుబాటులోకి తీసుకువచ్చి భూసారాన్ని కాపాడుతుందని చెప్పారు.

సబ్బవరం స్టేషన్లో విధుల్లో చేరిన 5 గురు సిబ్బంది

సబ్బవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు సిబ్బంది శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్లోని 12 మంది సిబ్బంది పలు స్టేషన్‌లకు బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. వీరి స్థానంలో పలు స్టేషన్ల నుంచి సబ్బవరం స్టేషన్‌కు బదిలీపై వచ్చారన్నారు. వీరిలో ఐదుగురు శుక్రవారం విధుల్లో చేరినట్లు పేర్కొన్నా రు. ఇందులో కోడూరు స్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు, కొత్తకోట నుంచి పీసీలు సురేష్, శ్రీను, ఎస్.రాయవరం నుంచి శ్యామ్ సుందర్, చోడవరం నుంచి ఉమెన్ కానిస్టేబుల్ సుభాషిణి విధుల్లో చేరినట్లు వెల్లడించారు. మిగిలిన వారు కూడా త్వరలోనే విధుల్లో చేరతారన్నారు.

తాండవలో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం


తాండవ ప్రాజెక్టులో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు తాండవ రిజర్వాయరులో స్వల్పంగా నీటి మట్టం పెరిగింది. జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయరు ప్రత్యేకత సంతరించుకుంది. దీని నీటి ఆధారంగా రెండు జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 52 వేల ఎకరాలు ఆయకట్టులో ఖరీఫ్ సీజన్‌కు వరి పంట సాగవుతుంది. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు. ప్రస్తుతం తాండవ రిజర్వాయరులో నీటి మట్టం 365 అడుగులకు చేరిందని ప్రాజెక్టు జేఈ ప్రేమకుమార్ తెలిపారు. వర్షాలకు ముందు తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 364.5 అడుగులు ఉండేదన్నారు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో రోజుకు 250 క్యూసెక్కులు నీరు ప్రాజెక్టులోకి వచ్చిందన్నారు. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో శుక్రవారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కేవలం 42 క్యూసెక్కులు మాత్రమే ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరు ఇబ్బంది ఉండదని జేఈ తెలిపారు.

ఆలయ భూముల శిస్తుకు వేలం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయ నిర్వహణాధికారి దివ్య తేజ ఆధ్వర్యంలో 12 ఎకరాల భూములు శిస్తులకు వేలం నిర్వహించగా లింగంపేటకు చెందిన గోలకొండ చినసత్తిబాబు ఐదెకరాలను రూ.24వేలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ ఐదెకరాలు రూ. 29 వేలకు శిస్తుకు వెళ్లిందని, ఉన్నతాధికారులకు తెలియజేసి, నిర్ణయం తీసుకుంటామని ఈవో తెలిపారు. మరో 7 ఎకరాలకు సంబంధించి వేలం పాటలో రైతులు ఎవరూ ఆసక్తి చూపలేదని చెప్పారు.

కల్తీ ఇసుక.. నిర్మాణదారులకు మస్కా



పూడిమడక తీరంలో ఇసుక అక్రమ నిల్వలు (సముద్ర ఇసుక)

అచ్యుతాపురం: చెరువైనా.. ఏరైనా.. ఆఖరికి సముద్ర తీరమైనా మాకేంటి ఇసుక దొరకాలేగానీ దోచేయడమే తరువాయి అన్న చందంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. అచ్యుతాపురం సెజ్ ప్రాంతంలో నిత్యం పరిశ్రమలకు సంబంధించిన విస్తరణ, ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణ నేపథ్యంలో పెరిగిన ఇసుక డిమాండ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. గోదావరి ఇసుకలో సముద్రపు ఇసుక కలిపి అమ్మేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానంపై విరుచుకుపడిన కూటమి నేతలు ఇప్పుడు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి నిర్మాణదారులను మోసం చేస్తున్నారు.

కూటమి నేత అక్రమ వ్యాపారం...

అచ్యుతాపురం మండలం పూడిమడక కేంద్రంగా కూటమి నేత ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారు. తీర ప్రాంతంలోని పలు చోట్ల ఇసుకను నిల్వ ఉంచి రాజమహేంద్రవరం నుంచి వచ్చిన గోదావరి ఇసుకలో కలిపి కల్తీ చేస్తున్నారు. అక్కడ నుంచి రూ. 35వేలకు కొనుగోలు చేసి తీసుకొచ్చిన 50 టన్నుల ఇసుకలో ఉచితంగా లభిస్తున్న సముద్రపు ఇసుక కలిపి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుకను కొనుగోలు చేయాలంటే డీడీ చెల్లించడం, కొద్ది కాలం నిరీక్షించడం ఇష్టం లేని వారు పూడిమడక కేంద్రంగా జరుగుతున్న అక్రమ ఇసుక వ్యాపారాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

నిర్మాణాలకు వాడితే ప్రమాదం...

- నది ఇసుకలో కలిపిన సముద్ర ఇసుకను ఇళ్లకు ఇతర భవన నిర్మాణాలకు వాడకూడదు.
- అందులో ఉప్పు ఉండటం వల్ల చెమ్మను పీల్చుకుంటుంది. గోడలు పాక్కిపోయి బీటలు వారుతాయి.
- లోపల ఉన్న ఇనుము తుప్పు పట్టి భవనాలు వేగంగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే ప్రమాదముంది.
- పునాదులను నింపడానికి వినియోగిస్తే నేల భాగం చెమ్మ చేరి గచ్చులు, గ్రానైట్, చలువరాతి పలకలు బీటలు వారుతాయి.

కల్తీ ఇసుక ఇలా గుర్తించాలి..

- నిజానికి తమకు లభిస్తున్న ఇసుక కల్తీదో లేక నదుల నుంచి తెచ్చిందో సామాన్యులకు తెలియటం కష్టం.
- నిర్మాణదారులు ఇసుకను నీటిలో వేసి నీరు రుచి చూడాలి. ఉప్పుగా ఉంటే సముద్రపు ఇసుక గుర్తించి నిర్మాణానికి ఉపయోగించకుండా జాగ్రత్త పడాలి.

మెరైన్, మత్స్య శాఖ ఏం చేస్తున్నట్లు..?

సహజంగా పూడిమడక వంటి సముద్ర తీరాల వెంబడి గట్టి నిఘా వ్యవస్థ ఉండాలి. శాంతి భద్రతల పోలీసులతో పాటు, మెరైన్ పోలీసులు, మత్స్య శాఖ తీర ప్రాంత కదలికలపై దృష్టి సారించాలి. కానీ బోట్ల యజమానుల గుర్తింపునకు కమీషన్లు, మత్స్యకార భరోసా జాబితాలో అనర్హులను చేర్పడంలో మత్స్య శాఖకు ఉన్న శ్రద్ధ ఈ ప్రాంతంలోని అక్రమ కదలికలపై లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మెరైన్ విభాగం కూడా స్వచ్ఛత కార్యక్రమాలు, ఫొటోల పోజులిచ్చే కార్యక్రమాల్లో పాల్గొనడం తప్ప తీర ప్రాంత గస్తీలో శ్రద్ధ చూపడం లేదు. అంతే కాకుండా రెవెన్యూ విభాగంలో దిగువ స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్ల తీర ప్రాంతాలకు రక్షణ లేకుండా పోతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాక్షికంగా ఇల్లు కూల్చివేత దారుణం


కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

కోటవురట్ల: జగనన్న కాలనీలో ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మించుకున్న ఇంటిని కూటమి ప్రభుత్వం కూలగొట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే ఆశయంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారన్నారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఇళ్లు నిర్మించుకుని సొంతింటి కలను నెరవేర్చుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి లే అవుట్‌లో చివరన ఉన్న ప్లాట్లలో అదనంగా ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కలుపుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం కలగలేదన్నారు. అయితే రాజకీయ కక్షతో ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూలగొట్టే ఘనతను కూటమి ప్రభుత్వం దక్కించుకుందని విమర్శించారు. గొట్టివాడ జగనన్న కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టుమూరి అప్పారావు నిర్మించుకున్న ఇంటిని పాక్షికంగా కూలగొట్టడం దారుణమన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే ఆ ఇంటిని కూలగొట్టారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెల్లో రాజకీయ కక్షలు చోటుచేసుకుని ఆత్మీయతలు, బంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆ పార్టీ కార్యకర్తలలో పగ, ప్రతీకారాలు నింపుతోందని, దాంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇటువంటి దారుణ ఘటనలకు స్వయానా మంత్రులు వత్తాసు పలికి అధికారులను వేధించి మరీ కక్షలకు పాల్పడటం దారుణమన్నారు. ఇలా ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకుంటూ పోతే మనుగడ కష్టమవుతుందన్నారు. ఇకనైనా ఇటువంటి రాజకీయ కక్షలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు


ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న రైతులను సత్కరిస్తున్న గణపర్తి వాసులు

మునగపాక: ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సర్పంచ్ చదరం నాయుడు పేర్కొన్నారు. మండలంలోని గణపర్తిలో ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ ప్రణాళికను రైతులకు వివరించారు. భూసారానికి అనుగుణంగా పంటల సాగు చేపట్టాలన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలమన్నారు. కూరగాయల సాగు ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న రైతులు కర్రి కన్నారావు, మల్లేశ్వరరావు, దారనాయుడు, దారబాబు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారిశెట్టి రామలక్ష్మి, పెద్దలు కాళ్ల చంద్రమోహన్, ఆడారి కృష్ణవేణి, సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి షణ్ముక్, యూనిట్ ఇన్‌చార్జి సతీష్, పద్మ, దేవి పాల్గొన్నారు.

అప్పలనరసింహం సేవలు మరువలేనివి


మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం 18వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అప్పలనరసింహం విగ్రహానికి గ్రామస్తులతోపాటు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో మంచినీటి కొరతను గుర్తించి పలు వాటర్ ట్యాంక్‌లను తన స్నేహితులతో నిర్మించారన్నారు. నాగులాపల్లి గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, పీఏసీ చైర్మన్ పాలమరశెట్టి నూకాలయ్య, వేగి సోమేశ్వరరావు, రాజు నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మళ్ల కాలేశ్వరరావు, శరగడం సత్యనారాయణ, మళ్ల బాపునాయుడు, మోరా రమేష్ పాల్గొన్నారు.

తుది దశలో నూకాంబిక ఆలయ పునర్నిర్మాణం


నూతన ఆలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని, త్వరలో ప్రారంభించి భక్తులకు దర్శన భాగ్యం కలిస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక నూకాంబిక ఆలయంలో దేవదాయ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయంలో వేస్తున్న గ్రానైట్ ఫినిషింగ్ టైల్స్‌ను వాడకూడదని, దీనిని మార్చి రఫ్ గ్రానైట్, న్యాచురల్ స్టోన్ ఫ్లోరింగ్ వేయాలని సూచించారు. ఆలయ ప్రాంతమంతా సుందరంగా తీర్చిదిద్దాలన్నారు దేవాలయంలో ఏసీలు, విద్యుత్ దీపాలు విరివిగా ఏర్పాటు చేయాలని కోరారు. దేవాలయ ప్రాంగణంలో ఇకపై చేయు అభివృద్ధి పనులు మాస్టర్ ప్లాన్ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో చేయాలన్నారు. ఆలయానికి కావలసిన భూములు కొనుగోలు చేయడానికి సంబంధిత యజమానులతో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వి.రాంబాబు, దేవదాయ శాఖ డీఈఈ కృష్ణ, ఉపసపతి శ్రీనివాసచార్యులు, ఏఈ శివప్రసాద్, జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మునగపాక ఎస్ఐకు పురస్కారం



ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ఎస్ఐ పి.ప్రసాదరావు ఉత్తమ అధికారిగా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి పురస్కారం అందుకున్నారు. అనకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన క్రైమ్ మీటింగ్‌లో ప్రసాదరావు సేవలను గుర్తించిన సిన్హా అభినందించడంతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోలీసు సేవలను మరింత విస్తృతం చేయాలని, అర్జీదారులకు సకాలంలో సేవలందించాలని ఎస్పీ సూచించినట్లు ఎస్ఐ తెలిపారు.

దేశ హితమే ‘తితిక్ష’ నాటిక


చీకటి పువ్వు నాటికలో ఓ సన్నివేశం


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ జ్యోతి


తితిక్ష నాటికలో కోర్టు సన్నివేశం


హాజరైన ఆహూతులు

కశింకోట: సమాజ నాశనానికి కారణభూతమవుతున్న గంజాయి వ్యాపారాన్ని మానడానికి ససేమిరా అన్న కుమారున్ని కన్నతల్లి హతమార్చిన కథాంశంతో ప్రదర్శించిన ‘తితిక్ష’ (సహనం) నాటిక ఆహూతులను విశేషంగా అలరించింది. ఇక్కడి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళాపరిషత్ నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గురువారం రాత్రి స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేదికపై రెండో నాటికగా ప్రదర్శించారు. కాకినాడకు చెందిన ఉమా ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన నాటిక ఇలా సాగింది. దేశం కోసం తన ప్రాణాలను శ్రీకృష్ణ త్యాగం చేశారు. భార్య భారతి తన కుమారుని అల్లారు ముద్దుగా పెంచుతోంది. అతడు రహస్యంగా సాగిస్తున్న గంజాయి వ్యాపారం మానివేయాలని చెప్పగా, దానికి ససేమిరా అనడంతో హత్య చేసి జైలుకు వెళ్తుంది. అయితే భారతి అన్నయ్య రాధాకృష్ణ మాత్రం తన చెల్లెలు నిర్దోషి అని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు. కోర్టులో భారతి తాను చంపింది గంజాయి రాక్షసుడ్ని అని, చంపకపోతే ఎన్నో జీవితాలు నాశనమవుతాయని అంటుంది. న్యాయ స్థానం తీర్పు ఇవ్వబోతుండగా, గంజాయి భూతం వచ్చి ఆమెను చిత్రహింసలు పెడుతుంది. న్యాయ దేవత కళ్ల గంతలు విప్పి చేతిలో ధర్మ కాటాను భారతి చేతిలో పెడుతుంది. రాజ్యాంగ పుస్తకాన్ని మరో చేతిలో పెట్టి గంజాయి రాక్షసుడ్ని సంహరిస్తుంది. భారతిగా ఎస్. జ్యోతిరాణి, హరిచంద్రగా బి. గణేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డి. ఉమాశంకర్, రాధాకృష్ణగా రాధాకృష్ణ, జడ్జిగా కె. పుల్లారావు, ఎస్ఐగా నాచూడి అప్పారావు, అమీన్‌గా శ్రీనివాసరావు, వివేక్‌గా డీఎస్ఎస్ కుమార్, అభిరాంగా డి. వినయ్, విలేకరిగా రఘుబాబు, గంజాయి భూతంగా శ్రీనివాస్, న్యాయ దేవతగా ముళ్లపూడి ఈశ్వరి, లాయర్‌గా ముళ్లపూడి విజయలక్ష్మి పాత్రోచితంగా నటించి ఆహూతులను మెప్పించారు. డి. ఉమాశంకర్ రచనకు కుమారుడు వినయ్ దర్శకత్వం వహించారు. రమణ సంగీతాన్ని సమకూర్చారు.

క్షమించడంలోనే నిజమైన ప్రేమ..

రాత్రి పది గంటల ప్రాంతంలో నిర్వహించిన ‘చీకటి పువ్వు’ నాటిక ఆహూతులను అలరించింది. కరీంనగర్‌కు చెందిన చైతన్య కళా భారతి బృందం ఈ ప్రదర్శన జరిపింది. జీవితంలో తప్పులు చేయడం సహజం. వాటిని తెలుసుకొని పశ్చాత్తాప పడిన తర్వాత వారిని దూరం పెట్టకుండా పెద్ద మనస్సుతో క్షమించి దగ్గరకి చేర్చుకోవాలి. ప్రాణం పోయిన తర్వాత బాధపడే కంటే ఉన్నప్పుడే బతికి ఉండగా, బాధ్యతగా వ్యవహరించి చేరదీయాలని, క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని తెలియజెప్పే ఇతి వృత్తంతో నాటికను ప్రదర్శించారు. పవిత్రగా గుడివాడ లహరి, వంశీగా కొత్తకొండ సత్యనారాయణ, హరిగా మంచాల రమేష్, సిద్ధార్థ్‌గా సూర్య, మోహన్ ప్రసాద్‌గా ఏపూరి శ్రీనివాస్, పీఎస్ నారాయణ మూలకథకు పరమాత్ముని శివరాం నాటకీకరణ చేశారు. మంచాల రమేష్ దర్శకత్వం వహించగా సురభి నాగరాజు సంగీతాన్ని అందించారు. రెండో రోజు జరిగిన ఈ నాటిక పోటీలను వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వారితోపాటు పోటీలకు సహకారం అందించిన ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వ్యాపారవేత్త పువ్వుల శ్రీనివాసరావు, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యుడు ఆళ్ల లింగాజీలను నిర్వాహకులు, అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు సత్కరించి జ్ఞాపికలందించారు.

చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం వద్దు


వర్మీ కంపోస్టు తొట్టెలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం: గ్రామాల్లో చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం చేయొద్దని డీపీవో శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, బయ్యవరం, నారాయణ రాజుపేట గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటి క్లోరినేషన్‌తో పాటు వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన బుట్టల్లోనే వేస్తూ పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి


నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

నక్కపల్లి: యోగా చేయడంలో పిల్లల నుంచి పెద్దల వరకూ బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని శుక్రవారం నక్కపల్లిలో యోగా మాసోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఒత్తిడి లేనప్పుడు ప్రశాంతంగా ఉంటుందన్నారు. రోజూ క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు ఆదేశాలు మేరకు విశాఖ కేంద్రంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరూ అంకితభావంతో పని చేయాలన్నారు. యోగా ప్రొటోకాల్ ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గ్రామీణ విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి మండలంలో విస్తృతంగా యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వేంపాడు ఆయుష్ వైద్యాధికారి కె.రఘు, గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణిసంధ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీవో భాగ్యవతి, యోగా శిక్షకులు దవరసింగి రాంబాబు, డీఎస్‌పీ సాయి, నరసమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యోగాలో శిక్షణ

ఎస్.రాయవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా శిక్షణ ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది, కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు యోగాంధ్రలో భాగంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎక్కువ మంది యోగాలో పాల్గొనేలా చూడాలన్నారు. జూన్ 15న టూరిజం శాఖ ఆధ్వర్యంలో రేవుపోలవరం బీచ్‌లో వెయ్యి మందితో యోగా శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 26న గ్రామ స్థాయిలో యోగా శిక్షణ పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లుపై చర్చించారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత, ఏపీవో యరకయ్య, ఏపీఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

సంయమనం పాటించాలని విజ్ఞప్తి


మాట్లాడుతున్న గణపర్తి సర్పంచ్ నాయుడు

మునగపాక: గణపర్తి గ్రామంలో వివాదాలకు తావులేకుండా అన్ని వర్గాల వారు సంయమనం పాటించాలని సర్పంచ్ చదరం నాయుడు కోరారు. గురువారం రాత్రి గ్రామ రామాలయంలో రాజకీయాలకు అతీతంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో పాకలు, షెడ్‌లు అక్రమంగా నిర్మించారని రెవెన్యూ సిబ్బందికి అందిన ఫిర్యాదు మేరకు వాటిని తొలగించారన్నారు. దళితవాడను ఆనుకొని రోలుగెడ్డ గట్టుపై తాత్కాలికంగా వేసుకున్న పశువుల పాకలపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. గ్రామంలో ముమ్మందు ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి వివాదాలకు తావు లేకుండా తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు సమక్షంలో రాజకీయాలకు అతీతంగా పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇందుకు సమావేశానికి హాజరైన వారంతా సమ్మతం తెలిపినట్లు ఆయన చెప్పారు. సమావేశంలో కర్రి రామనాగేశ్వరరావు, కాళ్ల చంద్రమోహన్, చదరం అప్పలనాయుడు, పిట్టా అప్పారావు, కాండ్రేగుల సీతారామ్, గొంది రవి తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ సహకారం అభినందనీయం


మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: గ్రామాభివృద్ధికి ఏషియన్ పెయింట్స్ అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. ఏషియన్ పెయింట్స్ సహకారంతో మునగపాకలో పలు సాగునీటి కాలువల అభివృద్ధికి సంబంధించి శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అవకాశం ఉన్నంత మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇందుకు గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు అప్పలరాజు, ప్రదీప్, గోవింద్, కృష్ణంరాజు కాలువ చైర్మన్ పెంటకోట రాము, పెద్దలు టెక్కలి పరశురామ్, మళ్ల సంజీవరావు, దాడి సూరిబాబు, దాడి శివ తదితరులు పాల్గొన్నారు.